మార్కెట్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కుషాయిగూడ: కూరగాయాల మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని శుక్రవారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, కాంగ్రెస్ ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, ఇతర కార్పొరేటర్లతో కలిసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. మార్కెట్ పైకప్పు మరమ్మతులు, పెయింటింగ్, రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరించాలని కోరారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు మేలు

బోడుప్పల్: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంలాంటిదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం బోడుప్పల్ 15వ డివిజన్‌లోని వెస్ట్ బాలాజీనగర్‌కు చెందిన స్వప్న కుమారికి వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన రూ 2.5 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును కుటుంబసభ్యులకు అందజేశారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ వెంకటేష్‌యాదవ్, కాంగ్రెస్ నేతలు లోకేష్ తదితరులున్నారు.

దిష్టిబొమ్మ దహనం

అల్వాల్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నేరేడ్‌మెట్ చౌరస్తాలో కాంగ్రెస్ నేతలు కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేటీఆర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్లు ఎస్‌ఆర్.ప్రసాద్, ఇందిరాచంద్రశేఖర్, చిత్రగోకుల్, నాయకులు చంద్రశేఖర్, రాఘవన్, కుట్టి శ్రీను, ఆంద్రూస్, సాయికిషోర్, రాజలింగం, యాది, బబ్లూ, ప్రేమ్, మహేష్, మోహన్‌సాయి, నరేష్, భాషా, సాయి, కృష్ణ, శంకర్‌రావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు నిధులు కేటాయించాలి

అల్వాల్: బోనాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని నియోజకవర్గ ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ నేతలు బద్దం పరుశురామ్‌రెడ్డి, జేఏసీ వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, ఫరీద్, సాయిగౌడ్, బాలకృష్ణ, శంకర్, శ్రీనివాస్, గణేష్, వినీత్ తదితరులున్నారు.

అహ్మదాబాద్ మృతులకు నివాళి

అల్వాల్: అహ్మదాబాద్ విమాన దుర్ఘటనలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని శుక్రవారం కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో నేరెడ్‌మెట్‌లో నివాళులర్పించారు. సీనియర్ నాయకులు చంద్రశేఖర్, రాఘవన్, కుట్టి శ్రీను, ఆంద్రూస్, సాయికిషోర్, రాజలింగం, యాది, బబ్లూ, ప్రేమ్, మహేష్, మోహన్‌సాయి, నరేష్, భాషా, కృష్ణ, శంకర్‌రావు, రాజేష్, నారాయణరెడ్డి, కనకరాజు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని జెడ్సీకి వినతి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ శుక్రవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గిన్నీస్ వరల్డ్ రికార్డ్ గ్రహీతకు సన్మానం

నటుడు శోభన్‌బాబు మనుమడిని కలిసిన అభిమానులు

మేడిపల్లి : ప్రముఖ నటుడు శోభన్‌బాబు మనువడు డాక్టర్ సురక్షి బత్తినను శోభన్‌బాబు అభిమానులు ఘనంగా సన్మానించారు. గైనకాలజీలో వైద్య విధులను నిర్వర్తిస్తూ.. అరుదైన శస్త్ర చికిత్స చేసి గర్భాశయంలో ఉన్న 4.5 కేజీల యుటెరస్‌ని టూత్రీడీ, లాప్రోస్కోపి ద్వారా సుమారుగా 8 గంటల పాటు శ్రమించి సిస్టను తొలగించి వైద్య రంగంలో అరుదైన రికార్డును సృష్టించిన డాక్టర్ సురక్షిత్‌కు ఈ అరుదైన ఘనతతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి గిన్నీస్ రికార్డును సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి శోభన్‌బాబు సేవాసమితి అధ్యక్షుడు నర్సింహ చెన్నైలో ఆయనను కలిసి సత్కరించారు.

సామూహిక అక్షరాభ్యాసం

మేడిపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమలానగర్ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుల భాస్కర్‌ల ఆధ్వర్యంలో పాఠశాలలో కొత్తగా చేరిన ప్రీ ప్రైమరీ, ఒకటో తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఆర్. జరీనా, మాధవి, జయలక్ష్మి, లక్ష్మి, సత్యసాయిబాబా, ప్రతినిధి సౌమ్య, టీచర్లు తదితరులున్నారు.

పొంచి ఉన్న ముప్పు !



వివేక్‌నగర్‌లో ఓపెన్ డ్రెయిన్ నాలా

పూర్తి కాని బాక్స్ డ్రెయిన్ పనులు
- భయాందోళనలో కాలనీవాసులు
- కౌన్సిల్ సమావేశంలో మేయర్ దృష్టికి తీసుకొచ్చిన కార్పొరేటర్

రామంతాపూర్ : వర్షాకాలం వస్తుందంటే చాలు రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్ పరిధిలోని కొన్ని కాలనీలు, బస్తీల ప్రజల్లో వణుకు మొదలవుతోంది. ఏ అర్ధరాత్రి తమ ఇళ్లలోకి వరదనీరు వస్తుందేమోనని, బిక్కుబిక్కుమంటూ.. గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రామంతాపూర్ డివిజన్ పరిధిలోని వివేక్‌నగర్‌లోని బాక్స్ డ్రెయిన్ వరద నీటి కాల్వ పనులను 4 నెలల క్రితం రూ.1.30 కోట్లతో పనులను ప్రారంభించారు.

మొదట్లో వేగం.. తర్వాత జాప్యం..

ప్రారంభ దశలో బాక్స్ డ్రెయిన్ పనులు వేగవంతంగా కొనసాగి, తర్వాత పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో కాలనీవాసులు ఇంటి నుంచి బయటికి రాకుండా ఇళ్లలోనే ఉండే పరిస్థితి ఏర్పడింది.
☛ వివేక్‌నగర్‌లో కొనసాగుతున్న బాక్స్ డ్రెయిన్ పనులు నత్తనడకన కొనసాగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాక్స్ డ్రెయిన్ పనుల కోసం తవ్వి వదిలేసిన కాల్వపై కప్పులు వేయకుండా వదిలేయడంతో ఏ అర్ధరాత్రి వర్షాలు వచ్చినా.. నాలాలు పూర్తిగా నిండిపోయి వరదనీరు ఇళ్లలోకి వస్తాయోమోనని ఆందోళన చెందుతున్నారు.

శాంతినగర్‌లో...

డివిజన్ పరిధిలోని శాంతినగర్‌లో వరద నీటి కాల్వ పనులను ప్రారంభించి 3 నెలలు గడుస్తున్నా.. పూర్తికాకపోవడంతో ఇటీవల కురిసిన భారీవర్షాలకు వరద నీరు ప్రవహించి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

మేయర్ దృష్టికి తీసుకెళ్లాం



డ్రెయిన్ పనుల జాప్యంపై మేయర్ దృష్టికి తీసుకెళ్లాం. సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరాం. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో బాక్స్ డ్రెయిన్ పనుల జాప్యంపై మాట్లాడాను. అయినా నిలిచిపోయిన పనులను కాంట్రాక్టర్ తిరిగి ప్రారంభించలేదు.

– కార్పొరేటర్ శ్రీవాణి

అసంపూర్తి పనులతో ఇబ్బంది పడుతున్నాం



వివేక్‌నగర్‌లో గత 3 నెలలుగా కొనసాగుతున్న బాక్స్ డ్రెయిన్ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కొన్ని ఇళ్లలోని వారు బయటకు రాకుండా ఇళ్లలోనే బందీలైపోయారు. వర్షాలు ప్రారంభమైన పనులు నత్తనడకన నడుస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందో అర్థం కావడం లేదు. ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలి.

– జానకి, వివేక్‌నగర్

మధ్యలోనే ఆపేశారు



శాంతినగర్‌లో వరదనీటి కాల్వ పనులు 3 నెలల క్రితం ప్రారంభించి మధ్యలోనే వదిలేసి తిరిగి ప్రారంభించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి వరదనీరు ఇళ్లలో చేరింది. వెంటనే పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు చూడాలి.

– రాజు, శాంతినగర్

నేడు జాతీయ లోక్ అదాలత్

కుషాయిగూడ: జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆధ్వర్యంలో నేడు కుషాయిగూడలోని మల్కాజిగిరిజిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, జిల్లా సేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ ఎస్.ఎన్. శ్రీదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో న్యాయసాయంతో పాటు సివిల్, క్రిమినల్, వాహన ప్రమాదాలు, బ్యాంకు రికవరీ, చెక్‌బౌన్స్, భూ వివాదాలు వంటి కేసులకు పరిష్కారం లభిస్తుందని, దీనిని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

15న నాట్యకేళి కూచిపూడి నృత్యంపై క్విజ్

మల్కాజిగిరి: మంజీరా అకాడమీ ఆఫ్ కూచిపూడి నృత్యం, తెలంగాణ భాషా సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో తొలిసారి నాట్యకేళి పేరున కూచిపూడి డ్యాన్స్ క్విజ్ నిర్వహిస్తున్నామని నిర్వాహకురాలు రేణుకా ప్రభాకర్ ప్రకటించారు. మల్కాజిగిరి దీన్‌దయాళ్‌నగర్‌లోని కల్పతరు పాఠశాలలో ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు డ్యాన్స్ క్విజ్ జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇతర వివరాలకు 9490207133.

నాట్య గురువుకు సత్కారం



గౌతంనగర్: నాట్యగురువు, డాక్టర్ ఎస్పీ భారతి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం ముగింపు సమావేశంలో ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ గవర్నర్ లయన్ ఎస్.మనోహర్‌రెడ్డి, అధ్యక్షుడు లయన్ బత్తిన రాజమౌళి ఆధ్వర్యంలో 'డ్యాన్సర్స్ డ్యాన్సర్' అవార్డుతో సత్కరించారు. డాక్టర్ మహేశ్వర స్వామి సిద్ధాంతి, సంతోషి, లతామాధురి, మనోజ్, ప్రవీణ్ తదితరులున్నారు.

ఫిట్‌నెస్ లేని వాహనాలపై ఆర్టీఏ చర్యలు



రామంతాపూర్‌లో వాహనాన్ని సీజ్ చేస్తున్న ఎంవీఐ రవీందర్‌రెడ్డి

ఉప్పల్: ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్లపైకి వస్తే సీజ్ చేస్తామని ఉప్పల్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. స్కూల్ వాహనాల్లో ప్రయాణించే పసిపిల్లల భద్రత ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఫిట్‌నెస్ లేని వాహనాల్లో పంపవద్దని సూచించారు. కాలం చెల్లిన వాహనాల్లో పిల్లలను తీసుకెళ్తామంటే అంగీకరించకూడదని స్పష్టం చేశారు. ఇప్పటికే పలు రకాలుగా వాహనదారులకు అవగాహన కల్పించామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటితో పాటు నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలను సైతం స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లేందుకు వినియోగిస్తున్నారని, అలా చేయడం నేరమన్నారు.

మెడికల్ కిట్ తప్పనిసరి..
ప్రతి వాహనంలో ప్రథమ చికిత్స బాక్స్, సీట్ కవర్స్, వాహన ఆర్సీ, నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, స్కూల్ పేరు, స్టిక్కర్లు లేకపోవడం ఇలాంటివి నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తాయన్నారు. గత రెండ్రోజులుగా నిర్వహించిన తనిఖీల్లో దాదాపుగా 50 వాహనాలకు పైగా ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేసినట్లు ఉప్పల్ ఎంవీఐ తెలిపారు.

స్కూళ్లకు మా వాహనాలను అనుమతించాలి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో ఆటో, వ్యాన్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కాప్రా: కొందరు ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు విద్యార్థుల రవాణాకు తమ వాహనాలను అనుమతించడం లేదని ఆటో, వ్యాన్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. నాచారంలోని ఓ పబ్లిక్ స్కూల్‌కు గతకొన్నేళ్లుగా విద్యార్థులకు రవాణా సేవలు అందిస్తూ.. ఉపాధి పొందుతున్నామని, ఇప్పుడు తమకు అనుమతిలేదని తేల్చి చెప్పారన్నారు. దీనిపై శుక్రవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసిన ప్రతినిధులు తమ సమస్యను వివరించారు. స్కూల్ బస్సుల్లోనే రావాలని విద్యార్థులపై యాజమాన్యం ఒత్తిడి తీసుకొస్తుందని, దీంతో విద్యార్థులు తమ ఆటోలు, వాహనాలను వద్దని చెబుతుండటంతో ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా దీన్నే నమ్ముకుని కుటుంబాలను పోషిస్తున్నామని, ఉన్న ఫలంగా వద్దంటే తమ పరిస్థితి అర్థం కావడంలేదన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ప్రైవేటు వాహనదారులు చెప్పారు. కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, ఆటో, వ్యాన్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



నూతన పవర్‌బోర్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలోని కమ్యూనిటీహాల్స్‌లో వసతులు కల్పిస్తామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. శుక్రవారం ఓల్డ్ మల్కాజిగిరి, మారుతీనగర్ కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నిరూపయోగంగా స్థలంలో పార్కు అభివృద్ధి, గ్రంథాలయాన్ని ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ విభాగం ఈఈకి సూచించామన్నారు. కమ్యూనిటీహాల్స్‌ను అభివృద్ధి చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు మరింత ఉపయోగపడేలా చూస్తామన్నారు. ఏఈ నవీన్, వీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'సీపెట్' సేవలు ప్రశంసనీయం



వార్షికోత్సవ వేడుకల్లో సీఐఏ అధ్యక్షుడు గోవిందరెడ్డి

కుషాయిగూడ: ప్లాస్టిక్ అనుబంధ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం, మానవ వనరులు, సాంకేతిక సేవలు ప్రశంసనీయమని చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో నిర్వహించిన 38వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రంగంలో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న 'సీపెట్' సేవలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిశ్రమల శిక్షణతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అందజేసేందుకు సీపెట్ నిరంతరం కృషి చేస్తుందని సీపెట్ హెడ్, డైరెక్టర్ రవి అన్నారు. చీఫ్ మేనేజర్ డాక్టర్ వి. కిరణ్‌కుమార్, ఆంజనేయశర్మ, శ్రీకర్, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లిలో 'జైల్ అదాలత్'

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో జైల్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్. రవీందర్ పర్యవేక్షణలో 27 మంది ఖైదీలకు సంబంధించిన 35 కేసులను పరిష్కరించి న్యాయసాయం అందజేసినట్లు జైలు పర్యవేక్షణాధికారి శివకుమార్ తెలిపారు. ఖైదీలకు ఇది ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.

వృద్ధుడి అదృశ్యం



వెంకటేశ్వర్లు

మేడిపల్లి : ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడలో నివాసం ఉండే తన కుమార్తె వద్ద వెంకటేశ్వర్లు (64) ఉంటున్నాడు. ఈనెల 3న ఉదయం 10 గంటలకు కుమార్తెకు బయటకు వాకింగ్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు చేయూతనివ్వండి

రామంతాపూర్ : డివిజన్ పరిధిలో ఇందిరానగర్ మెట్లగల్లీ సీసీరోడ్డు పనులు నెహ్రూనగర్ స్టామ్ వాటర్ డ్రైన్ పనులకు నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్‌రావు జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరలోనే పనులు ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

అధికారుల సమన్వయంతోనే స్థల సేకరణ

గౌతంనగర్: గౌతంనగర్ రైల్వేగేట్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణ స్థలాన్ని రైల్వే, జీహెచ్‌ఎంసీ, విద్యుత్‌శాఖల అధికారులు శుక్రవారం పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని స్థల సేకరణతో పాటు నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైల్వే ఇంజినీరింగ్ అధికారులు రవిప్రకాష్, సతీష్‌బాబు, విద్యుత్ ఏఈ చంద్రశేఖర్, జలమండలి ఏఈ నవీన్, జీహెచ్‌ఎంసీ ఏఈ దివ్యజ్యోతి, బీఆర్‌ఎస్ నేతలు మేకల రాముయాదవ్, బైరు అనిల్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్‌యూబీ నిర్మాణ స్థల పరిశీలన చేస్తున్న అధికారులు, బీఆర్‌ఎస్ నేతలు

అభివృద్ధి పనుల పరిశీలన

అంగన్‌వాడీ, బస్తీ దవాఖానాలను సందర్శించిన ఎమ్మెల్యే



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్లపల్లి డివిజన్‌లో పర్యటించారు.శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధి కుషాయిగూడ, నాగార్జుననగర్‌కాలనీ, సాయికృష్ణ ఎన్‌క్లేవ్, శివసాయినగర్, న్యూ వాసవీశివనగర్, సోనియాగాంధీనగర్, డీసీ కాలనీ, బీఎన్‌రెడ్డినగర్ కాలనీల్లో జరుగుతున్న బాక్స్‌డ్రైన్, యూజీడీ, రోడ్లు, థీమ్‌పార్కు అభివృద్ధి పనులను పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. కుషాయిగూడలోని బస్తీ దవాఖానాను ఆయన సందర్శించారు. పేదలకు అందుతున్న వైద్యం, మందులు, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అంకితభావంతో పనిచేసి పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు.

బస్తీ దవాఖానకు పక్కా భవనం..
బస్తీ దవాఖానాకు పక్కా భవనం నిర్మాణానికి తన వంతు సహకారం అందజేస్తానన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పిల్లల హాజరు వివరాలు, వారికి అందజేస్తున్న పౌష్టికాహార వివరాలను తెలుసుకున్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం..
నాగార్జుననగర్ కాలనీ రోడ్డు నెంబరు–1లో రోడ్డు అధ్వానంగా ఉందని, శివసాయినగర్‌లో అధిక తాగునీటి బిల్లులు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చర్లపల్లి డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఇంజినీరింగ్ డీఈ బాలకృష్ణ, ఏఈ స్వరూప, స్థానిక నేతలు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, పాండాల శివకుమార్‌గౌడ్, నేమూరి మహేష్‌గౌడ్, కనకరాజుగౌడ్, చక్రపాణిగౌడ్, వెంకటేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కపిర్తేశ్వర్‌కు సైంటిఫిక్ ఫెలోషిప్



రామంతాపూర్ : సామాజిక సంస్థల్లో పలు విద్యాసంస్థల్లో సైంటిఫిక్ టెక్నాలజీని విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నందుకు రామంతాపూర్ సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు బాలభారతి స్కూల్ సెక్రటరీ సత్తిరాజు కపిర్తేశ్వర్‌కు సైంటిఫిక్ ఫెలోషిప్ అవార్డును సైన్స్ టెక్నాలజీ కమ్యూనికేషన్ అడ్వైజరీ కౌన్సిల్ ప్రకటించింది. ఈ మేరకు అవార్డును కౌన్సిల్ సభ్యులు సీఎల్. నరసింహారావు ఆయనకు అవార్డును శుక్రవారం ప్రదానం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: బ్యాంక్ కాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 వరకు బ్యాంక్‌కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీ, బీరప్పగడ్డ, కల్యాణపురి, రాఘవేంద్రనగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నిఖిల్ నర్సింగరావు తెలిపారు.

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు. ఈస్ట్ బృందావన్ కాలనీ, వెస్ట్ బృందావన్ కాలనీ, శ్రీనివాస్‌కాలనీ, సత్తిరెడ్డి కాలనీ, ఆకృతి టౌన్‌షిప్, లక్ష్మీనగర్ (హుడా)కాలనీల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

రామంతాపూర్ : విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కామాక్షిపురం ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సబ్‌స్టేషన్ ఏఈ లావణ్య కోరారు.

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ బెల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నోమా ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు చాణిక్యపురి కాలనీ, సూర్యనగర్, గోకుల్‌నగర్, చాండీయానగర్, బాబానగర్ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.

◆ నాచారం ఇండోర్ కాకతీయ కర్షక్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రాంరెడ్డినగర్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు.

చిన్నారుల అక్రమ రవాణాను అరికట్టాలి

గౌతంనగర్: చిన్నారుల అక్రమ రవాణాను అరికట్టాలని ఆర్పీఎఫ్ ఏఎస్సై వెంకట్ అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో చిన్నారుల అక్రమ రవాణా నివారణకు ఆర్పీఎఫ్ బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల తల్లిదండ్రులు వారి పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీరస్వామి, నూర్, భరద్వాజ్, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.